నేడు నగరానికి ప్రధాని మోదీ, సీఎం జగన్ రాక

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం నగరానికి రానున్నారు. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. శనివారం ఏయూలో జరగనున్న బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ప్రధాని

ఏర్పాట్లు సర్వం సిద్ధం....

నరేంద్రమోదీతో కలిసి పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం విశాఖ నగరానికి చేరుకోనున్నారు. సాయంత్రం 6.35 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని ప్రధానికి స్వాగతం పలుకుతారు. అనంతరం రాత్రికి పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో బసచేస్తారు. శనివారం 12వ తేదీ ఉదయం 10.05 గంటలకు ఏయూ గ్రౌండ్‌లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 10.20 గంటలకు ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతారు. 10.30 - 11.45 గంటల వరకు ప్రధానితో కలిసి పలు శంకుస్థాపనలు, ప్రాజెక్టల ప్రారంభోత్సవాలలో పాల్గొంటారు.

ఖజానాలో కల్లోలం...

అవినీతి అధికారులపై వేటుపడేనా?

విశాలాంధ్ర - పాడేరు: స్థానిక జిల్లా, డివిజన్ ఖజానాలో అవినీతి అధికారుల వేధింపులు బాధితులకు అధికమయ్యాయి. ఈ విషయం కాస్త జిల్లా రాష్ట్ర అధికారుల దృష్టికి వెళ్ళింది. దీంతో జిల్లా రాష్ట్ర అధికారులు స్పందించి స్థానిక ఖజానా అధికారులకు హెచ్చరించారు. బాధిత ఉద్యోగులు వారి వారి బిల్లులు మార్చుకునేందుకు బిల్లులను అప్లోడ్ చేసి టోకెన్ ఇచ్చేందుకు ఐదు శాతం నుండి 10 శాతం కమీషన్ల రూపంలో ముందస్తు వసూళ్లకు పాల్పడుతుండడంతో బాధితులు ఆవేదనతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ఈ సంఘటనలు సదామామూలే అని ఇటువంటివి ఖజానా వ్యవస్థలో జరుగుతూనే వున్నాయని, గతంలో ఏసీబీ అధికారులకు స్థానిక డివిజన్ ఖజానాలో ఒకరు పట్టుబడినా ఎటువంటి మార్పు లేదని ఉద్యోగులు, కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖజానా అధికారులను గుర్తించినట్లు విశ్వసనీయవర్గాల నుండి తెలుస్తుంది. వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడవలసిందే! ఇప్పటికైనా ఖజానా అధికారుల పనితీరు అన్ని శాఖల ఉద్యోగులకు వేతనాలు, తదితర బిల్లులు చెల్లింపులలో అవకతవకలు లేకుండా చూస్తారో లేదో చూడవలసిందే! జిల్లా ట్రెజరీ అధికారిని ఈ విషయమై వివరణ కోరగా... గతంలో ఏం జరిగిందో తనకు తెలియదని తను నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని ఇకమీదట ఎటువంటి అవినీతి జరగకుండా చర్యలు తీసుకుంటామని, బిల్లులు పెట్టే ఉద్యోగులు పూర్తిస్థాయిలో కావలసిన డాక్యుమెంట్లు సమర్పించాలని సూచించారు. అన్ని శాఖల ఉద్యోగులు తమకు సహకరించి బిల్లులు సక్రమంగా సమర్పించాలని కోరారు.

రాష్ట్రానికి మోడీ అన్యాయం: సీపీఐ

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటనను నిరసిస్తూ మండల సీపీఐ నాయకులు స్థానిక మూడు రోడ్ల జంక్షన్లో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గొర్లే దేముడు బాబు మాట్లాడుతూ మోడీ ఈ రాష్ట్రానికి ఏం చేశారని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేస్తుందని ప్రశ్నించారు. రైల్వే జోన్‌పై స్పష్టత లేదని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరానికి నిధులు ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి అప్పలనాయుడు, దళిత హక్కుల పోరాట సమితి మండల కార్యదర్శి ఇల్లాకు రాము, సీమునిరి సూర్యనారాయణ, దమ్ము ముత్యాల నాయుడు, చప్ప కోటి, సీమునిరి రామనాయుడు, కొమ్మి ఈశ్వరరావు, గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.73 కోట్లు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి హుండీ ఆదాయం 44 రోజులకు గాను రూ. 1,73,13,2159 /-లు వచ్చినట్టు పూర్తి అదనపు బాధ్యతల ఈఓ వేంద్రపు త్రినాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు, రాంబాబు ధర్మ కర్తలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారులు ఆనంద్ కుమార్, రమణమూర్తి, వై.శ్రీనివాసరావు, జంగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జోరుగా భూముల రీ సర్వే

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలోని పైడిపాల, పెద్దిపాలెం, మాక వరపాలెం, శెట్టిపాలెం గ్రామాల్లో భూముల రీ సర్వే పనులు జోరుగా సాగుతున్నాయని మండల తహశీల్దార్ ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే పనులకు రైతులు సహకరించాలని అన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించండి

విశాలాంధ్ర - జికేవీధి: అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలని జికేవీధి ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్పందనలో వచ్చిన పెన్షను దరఖాస్తులపై దృష్టిసారించాలని అన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - నాతవరం: వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులకు అందుబాటులో ఉండా లని ఎంపీడీఓ ఎల్.యాదగిరీశ్వరరావు అన్నారు. గురువారం నాతవరం మండలం మన్యపురట్ల సచివాలయాన్ని సందర్శించారు. గ్రామస్తులు నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. నిర్మాణంలో ఉన్న ఆర్‌బికే సెంటర్, హెల్త్ క్లినిక్‌ను, 3 లక్షలతో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాయుడు, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్ కిశోర్ పాల్గొన్నారు.

దారాలమ్మ తల్లిని దర్శించుకున్న జ్యోతిర్మయి

విశాలాంధ్ర - సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్న అన్నమయ్య భక్తురాలు తిరుమల తిరుపతి ప్రముఖ గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి గురువారం శ్రీ దారాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. స్థానిక దేవాలయం అర్చకులు, మహిళా భక్తులు కొండవీటి జ్యోతిర్మయి అమ్మకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమెను శాలువతో సన్మానించి అమ్మవారి ఫోటోను బహుకరించారు.

కంప్యూటర్ సెంటర్ ప్రారంభించిన బెహరా

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు బంట కాలనీలో ఎస్‌బీఎస్ కంప్యూటర్ సెంటర్‌ను జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ప్రారంభించారు. ప్రస్తుతం, రానున్న భవిష్యత్ అంతా కంప్యూటర్‌తో ఎంతో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బివి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నర్సింగరావు వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: కొండకర్ల ఇఛ్చా ఫౌండేషన్‌లో శరగడం నర్సింగరావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అచ్యుతాపురం గ్రామానికి చెందిన శరగడం నర్సింగరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా "ఓదార్చే మనసు కన్నా సాయం చేసే గుణమే మిన్న" అనే నినాదంతో శరగడం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శరగడం కుటుంబీకులు అనాథ పిల్లలకు పళ్లు, ఒక రోజు భోజనం సరిపడా నగదు అందజేసారు.

ప్రధాని, సీఎం సభలను విజయవంతం చేయాలి

ఐటీ మంత్రి గుడివాడ

విశాలాంధ్ర -యలమంచిలి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం వైఎస్.జగన్ ఈనెల 12న విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి మున్సిపాలిటీ, మండలంలో గురువారం యలమంచిలి నియోజక వర్గ శాసనసభ్యులు యూ.వి.రమణమూర్తిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరంలో కోట్లాది రూపాయలతో ప్రధానమంత్రి మోదీ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు, నాలుగు మండలాల ప్రజలు సభలకు తరలి వెళ్లేందుకు 104 బస్సులు ఏర్పాటు చేసామన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఎంపీపీ బి.గోవింద్, పట్టణ వైసీపీ అధ్యక్షులు బి.ఎర్రయ్య దొర పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో లోగిలి వంతెనకు మోక్షం

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మూడు పంచాయతీ గ్రామాల గిరిజనుల రాకపోకలకు సౌకర్యంగా ఉన్న లోగిలి వంతెన పదేళ్ల క్రితం సంభవించిన హుదూద్ తుఫాను కారణంగా నేలకొరిగింది. దీంతో ఆయా పంచాయతీ గ్రామాల గిరిజనుల రాకపోకలకు అష్టకష్టాలు పడ్డారు. స్థానిక అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేకత చొరవతో వంతెనకు మోక్షం వచ్చిందని చెప్పక తప్పదు. ఈ నేపథ్యంలో కోటి 80 లక్షలతో లోగిలి బ్రిడ్జి నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా సౌకర్యం లేక పలు ఇబ్బందులు పడుతున్న గసభ, కొల్లాపుట్టు, సొవ్వ పంచాయతీల గిరిజనులు అనేక ఇబ్బందులు పడ్డారని అయితే బ్రిడ్జి నిర్మాణంతో ఆయా గ్రామాల గిరిజనులకు రవాణా కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీ ఈశ్వరి, మార్కెటింగ్ చైర్మన్ రాజా రమేష్, గసబ సర్పంచ్ సునీత, ఎంపీటీసీ జమ్మ, వైసిపి నాయకులు కృష్ణారావు, సింహాచలం, గణపతి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ విశాఖ వస్తే అడ్డుకొని తీరుతాం

పీసీసీ సభ్యులు జగతా శ్రీనివాస్

విశాలాంధ్ర - పాయకరావుపేట: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు వస్తే అడ్డుకుంటామని పీసీసీ సభ్యులు జగతా శ్రీనివాస్ హెచ్చరించారు. పాయకరావుపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి, వైసిపి పార్టీలు కుమ్మక్కై రాష్ట్ర అభివృద్ధిని కుంటుపరుస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రను ఏమాత్రం అభివృద్ధి చేశారో చూపించాలని సవాల్ విసిరారు. వేల కోట్ల పనులకు శంకుస్థాపన చేస్తున్నారని ప్రచారం చేస్తున్నారని, అసలు శంకుస్థాపనలో రైల్వే జోన్ ఉందా అని ప్రశ్నించారు. భోగాపురం విమానాశ్రమం కూడా పెండింగ్‌లోనే ఉందని గుర్తు చేశారు. ప్రత్యేక హెూదా ప్రస్తావన లేదని, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మించకుండా విశాఖ స్టీల్‌ని ప్రైవేటుపరం చేసేందుకు కంకణం కట్టుకున్నారని ఆరో పిం చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పోలవరపు అప్పల రాజు, ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు మురుకుర్తి గంగరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

విశాలాంధ్ర - పెదబయలు: మండల సమీపంలో గలగండ పంచాయతీ గలగండ, తురకలవలస, అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రమేష్ రావన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెర్రసింగ్, ట్రేగర్ ట్రెంచ్ వర్క్ ఉపాధి కూలీలకు రోజువారి కూలి 257 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.విగ్గిన్స్, ఏపీఓ కెవిఎల్ఎన్ మూర్తి, బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్లో జిల్లా స్థాయి ఎంపికలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల కణితి జిల్లా పరిషత్ హైస్కూల్లో జిల్లా స్థాయి త్రోబాల్, వాలీబాల్, బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, సమిష్టి కృషి, ఒత్తిడిని జయించడంతో పాటు, నాయకత్వ లక్షణాలు అలవడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, కణితి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, పీఈటీ మన్నాజీ, నాయకులు వేణుబాబు, చిత్రాడ రమణ, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, ఎన్నేటి రమణ, శీరం పాపారావు, కోమటి రమాదేవి, పసుపులేటి రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాంక్ సర్వీసులపై అవగాహన

విశాలాంధ్ర - అరకులోయ: బ్యాంక్ సర్వీసులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ, పద్మలత చెప్పారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం బ్యాంక్ సర్వీసులపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ అరకు బ్రాంచ్ మేనేజర్ తాళ్లపూడి వెంకట నాయుడు ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఇన్సూరెన్స్, పాలసీలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ మేనేజర్ జె.మణిభూసన్, సిపిడిసి మెంబర్ సిహెచ్ రామరాజు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంతో మేలు

విశాలాంధ్ర - మల్కాపురం: నూతన విద్యా విధానం విద్యార్థులకు మేలు కలుగుతుందని జాతీయ సేవా పథకం సీనియర్ అధికారి వై.అనసూయా దేవి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టు రెండు నెలలు తప్పనిసరిగా చేయాలని, సామాజిక సమస్యలకు పరిష్కారాలు కను గొనాలని, కార్యాచరణ ప్రణాళికను కట్టుదిట్టంగా తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి. ఎస్.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు రోజా, జోత్స్న, అంజలీ దేవి, ఉమ, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో బాదుడే-బాదుడు

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల కర్రిముక్కిపుట్టు పంచాయతీ పలు గ్రామాలలో టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆదేశాలతో టీడీపీ సీనియర్ నాయకులు నీలకంఠం, పాత్ర, అర్జున్, గురుమూర్తి ఆధ్వర్యంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ ఆర్థిక సెక్రటరీ పి.శాస్త్రిబాబు మాట్లాడుతూ గ్రామాలలో కనీస మౌలిక సదుపాయాలు, రోడ్లు, డ్రైనేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా వుందని ఎక్కడా అభివృద్ధి కానరావడం లేదని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరుకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ శాస్త్రిబాబు, ఎం.రఘుపతి పడాల్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు చిరంజీవి, పార్టీ సీనియర్ నాయకులు రామదాసు, సిహెచ్.గోపాల్ ధనుంజయ, నాయకులు గల్లెల రామకృష్ణ, రాంబాబు, గురుమూర్తి, మహేష్, సిల్లేశ్వరావు, బాలరాజు, నరసింగరావు, చిరంజీవి, ప్రసాద్, సీతారాం, గశిరం రామకృష్ణ, కొండలరావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి స్వాగతం పలుకుతూ బీజేపీ రోడ్ షో

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారత ప్రధాని నరేంద్ర మోడీకి స్వాగతం పలుకుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ రోడ్ షో నిర్వహిస్తున్నట్టు బీజేపీ నాయకులు పురంధేశ్వరి తెలిపారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రూ. 15వేల కోట్లకు మించిన కేంద్ర పథకాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయన్నారు. ప్రధాని నిర్మాణం కోసం వస్తుంటే జగన్ సర్కారు మాత్రం ప్రధాని పర్యటన పేరిట కూల్చివేతలు సాగిస్తున్నా రన్నారు. రమేష్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో దొంగల హడావిడి ఎక్కువైందన్నారు. ఆయన అన్నీ గమనిస్తారని, అవినీతి అక్రమాలు సహించరని అన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ షీలానగర్ మారుతి జంక్షన్ నుంచి రోడ్ షో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బిజెపికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యతో వృత్తి నైపుణ్యం

విశాలాంధ్ర - అనంతగిరి: ప్రయోగాత్మక విద్య వల్ల విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు మెరుగుపడతాయని అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. అనంతగిరి గిరిజన సంక్షేమ బాలికల -1పాఠశాల, కొత్తవలస బాలుర పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ లను జెడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజుతో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. బాలికల-1 పాఠశాలలో కొత్తవలస హెచ్ఎం భాస్కరరావు వితరణగా ఇచ్చిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని, కొత్తవలస పాఠశాలలో బాలికల ప్రధానోపా ధ్యాయురాలు మల్లీశ్వరి ఇచ్చిన అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి, ఎగువసోభ సర్పంచులు సోమల రూతు, కొర్రా సింహాద్రి, పాఠశాల కమిటీ చైర్మన్‌లు సుబ్బారావు, కౌసల్య, ఉపాధ్యాయులు సొమర మత్స్య లింగం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

విశాలాంధ్ర - పరవాడ: వాస్తవాలను దాచి శ్మశాన వాటిక కబ్జాకు గురైందంటూ టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయడం తగదని వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు పేర్కొన్నారు. గురువారం ముత్యాలపా లెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్మశాన వాటిక ఎక్కడుందో కూడా తెలియని నాయకులు కబ్జాకు గురైందని గగ్గోలు పెట్టడం చూస్తుంటే దొంగే దొంగ అన్న చందంగా ఉందన్నారు. దిబ్బపాలెం శ్మశాన వాటిక ఎటువంటి ఆక్రమణలకు గురికాలేదని అధికారులు, విలేకరులకు ప్రత్యక్షంగా చూస్తే అర్థమవు తుందన్నారు. వాడచీపురుపల్లి తూర్పు ముత్యాలం పాలెం గ్రామం సర్వేనెంబర్ 332లో 86.55 ఎకరాల విస్తీర్ణం ఉందన్నారు. దీనిలోని 32 ఎకరాలను గ్రామ కంఠంగా సబ్‌డివిజన్ చేసి ముత్యాలంపాలెం గ్రామంగా 1986లో రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారన్నారు. అయితే మిగిలిన భూములు అమ్ముకోవాల్సిన టిడిపి నాయకులు అదనంగా పది ఎకరాలు మత్స్యకారులకు విక్రయించి మోసగించా రన్నారు. శ్మశాన వాటిక కోసం తన భూమిని కేటాయిస్తానని మాజీ ఎంపిపి మాసవరపు అప్పల నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో సర్పంచ్ చింతకాయల సుజాత, మాజీ ఎంపిటిసి అమ్మోరు, మత్స్యకార సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలపై మోడీ ప్రకటన చేయాలి

విశాలాంధ్ర - మధురవాడ: ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ రాష్ట్ర ప్రయోజనాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ, సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శులు వి.సత్యనారాయణ, డి.అప్పల రాజులు డిమాండ్ చేశారు. మధురవాడలో గురువారం నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. పోలవరం. ప్రాజెక్టుకు నిధుల విడుదల, రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, రాజధాని నిర్మా ణానికి నిధులు, గిరిజన విశ్వవిద్యాల యంపై తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వాసితుల సమస్యలు పరిష్క రించటం లేదని అన్నారు. ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజ్ ఇస్తారని చెప్పి జిల్లాకు ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున నిధులు విడుదల చేసారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ నాయ కులు యం.సన్ని పాత్రుడు, బి.అప్పలరాజు, వి.నరసింగరావు, సన్నయి, రాంబాబు, సీపీఎం నాయకులు బి.రాజ్ కుమార్, ఎ.గురుమూర్తిరెడ్డి, యస్.పైడితల్లి, కె.సుజాత, కె.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని ప్రకటన చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం చేపట్టమని ప్రధాని మోడీ విశాఖ బహిరంగ సభలో ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు ఆదినారాయణ, సీహెచ్ నర్సింగరావు, మంత్రి రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరుశాతం అమ్మాలని 27-01-2021న కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ నిర్ణయం తరువాత ప్రధాని మోడీ మొట్ట మొదటిసారి విశాఖలో పర్యటిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మరాదని పెల్లుబికిన నిరసనను గమనంలోకి తీసుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపివేస్తున్నట్లు ప్రధాని మోడీ నవంబరు 12వ తేదీన విశాఖలో జరిగే బహిరంగ సభలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత 21 మాసాల నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద, విశాఖలోను, ఆంధ్ర రాష్ట్రంలో విశాఖ స్టీల్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ నిరవధికంగా పోరాటాలు కొనసాగుతున్నాయని అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రత్యేక హెూదా, రైల్వే జోన్ గురించి ప్రధాని విశాఖ బహిరంగ సభలో మాట్లాడరని చెప్పిన బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాటలను ఖండిస్తున్నామని అన్నారు. ఏపీకి సంబంధించిన పై అంశాలపై మాట్లాడకుండా ప్రధాని విశాఖ మరి ఎందుకు వస్తున్నారని ప్రశ్నిం చారు. ఈ సందర్భంగా శుక్రవారం కుటుంబ సభ్యులతో దీక్షా శిబిరం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. శాంతియుతంగా జరుగుతున్న విశాఖ స్టీల్ కార్మికుల ర్యాలీపై దాడి చేసి పోలీసులు అక్రమంగా అడ్డుకొని వందలాది మంది కార్మికులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్, సత్యనారాయణరావు, రామకృష్ణ, వరహాల శ్రీనివాసరావు, డివి రమణారెడ్డి, నీరుకొండ రామచంద్రరావు, వైటి దాస్, ఎం.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం తరలింపుపై సీబీఐ విచారణ చేయాలి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర - నర్సీపట్నం: కేంద్రం నుంచి పేదలకు వస్తున్న బియ్యాన్ని అన్యాయంగా తరలిస్తున్నారని, దీనిపై సీబీఐ విచారణ చేయాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి తరలిస్తున్నార న్నారని, సివిల్ సప్లై మంత్రి కామూరి, కాకినాడ ఎమ్మెల్యే ద్వారపూడి చంద్రశేఖర్‌ల సహకారంతో పేదలకు వస్తున్న బియ్యాన్ని తరలిస్తున్నారంటే రాష్ట్రంలో ఎంత ఘోరమైన కుంభకోణం జరుగు తుందో అర్థం చేసుకోవచ్చు నన్నారు. గతంలో కేంద్రం ఇచ్చిన 5 లక్షల 70 వేల టన్నుల బియ్యానికి లెక్కలు లేవని కేంద్ర మంత్రి చెప్పారని, ఆ బియ్యమంతా ఏమైపోయి ందని ప్రశ్నించారు. ఇప్పటికైనా సిబిఐ విచారణ చేసి బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల 53 మంది డిఎస్పీలకు పోస్టింగులు, బదిలీలు ఇచ్చారని, ముఖ్యమైన స్థానాల్లో ఈ 53 మందిలో 12 మందిని రెడ్డి కులస్థులకే ఇచ్చారని, ఇది అన్యాయమన్నారు.

విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి: జేవీ

విశాలాంధ్ర - గాజువాక/పెదగంట్యాడ:: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని శ్రామిక సంఘం (టీఎన్‌టీ యూసీ) చీఫ్ ఎడ్వైజర్ జేవీ నరశింహమూర్తి డిమాండ్ చేశారు. గురువారం తిరుపతిలో నిర్వహించిన సమావేశంపై స్థానిక యూనియన్ కార్యాలయం స్పందించి ప్రకటన విడుదల చేసింది. జేవీ మాటల్ని ఉటంకిస్తూ ఇది తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి సంబంధించిన అంశం గా పేర్కొన్నారు. ఏపీ పూర్వపు మినిమమ్ వేజ్ బోర్డు డైరెక్టర్, స్టీల్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విశాఖ సందర్శిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రకటన చేయా లని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయ కులు సేతుపతి, రమేశ్ జేవీ బాలాజీ, శివరాజేశ్ యాదవ్, భారతి తదితరులు పాల్గొన్నారు.

చీమలాపల్లి డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర - పెందుర్తి: సుదీర్ఘ కాలంగా కాలుష్యంతో బాధపడుతున్న జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి డంపింగ్ యార్డ్ సమస్యకు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఎట్టకేలకు పరిష్కారం చూపించారు. చీమలాపల్లి, వేపగుంట, వరలక్ష్మీ నగర్, పొర్లుపాలెం గ్రామాల ప్రజలు స్థానిక డంపింగ్ యార్డ్ వల్ల ఎన్నో వ్యాధులకు గురవుతున్నారు. ఈ సమస్యని స్థానిక చీమలాపల్లి, వరలక్ష్మి నగర్, వేపగుంట, పొర్లుపాలెం వైసీపీ నాయకులు కార్పొరేటర్ ముమ్మన దేముడు దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యపై స్పందించిన కార్పొరేటర్ జీవీఎంసీ సిబ్బందిని కలిసి సమస్యని విన్నవించి పరిష్కారాన్ని చూపారు. సుమారుగా 15 రోజుల నుంచి అక్కడ ప్రతిరోజు రాత్రిపూట పనిచేసి ఇక్కడ నుంచి ప్రధాన డంపింగ్ యార్డ్‌కు చెత్తను తరలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిప్పల చందు, గంట్ల నర్సింహామూర్తి, అంగటి సూరిబాబు, బొడ్డు దేవుడుబాబు, చేవ్వేటి కిరణ్ కుమార్, గోపాల్, కంచిబోయిన సంతోష్, ఉమా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - హుకుంపేట: గ్రామల్లో భూ సమస్యల పరిష్కారానికి సర్వే వేగవంతం చేయాలని ఎంపీపీ కూడా రాజబాబు అన్నారు. గురువారం స్థానిక ఎంపిడీవో కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో తహాశీల్దార్, ఎంపీడీవోతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామల్లో భూ సమస్యలు, భూమి హక్కు పత్రాల్లో పేర్లు మార్పులు చేర్పులపై చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాలు అమలుపై దృష్టి పెట్టాలని కోరారు. అనేకమంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నట్లు తమ దృష్టికి సమాచారం వస్తుందని, విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మోడీ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – కె.కోటపాడు: విశాఖ ఏయూ గ్రౌండ్లో ఈనెల 12వ తేదీన జరుగు సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచ్చేస్తున్నారని, ఆ సభను జయప్రదం చేయాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ కోరారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద గురువారం వైసీపీ నాయకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. మండలం నుంచి 60 బస్సులను ఏర్పాటు చేశామని సభకు వెళ్లే వారికి ఉచిత ప్రయాణంతోపాటు భోజనం సదుపాయాలు కూడా కల్పించబడునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

లంకెలపాలెం ఫ్లైఓవర్ వద్ద వ్యక్తి మృతి



విశాలాంధ్ర – కూర్మన్నపాలెం: లంకెలపాలెం ఫ్లై ఓవర్ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. అతని వయసు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. రైలు ఢీకొట్టడంతో శరీరం నుజ్జయింది. మృతుని చేతులకు రబ్బర్ బాండ్స్, ఎడమ చేతికి బ్లేడ్తో గీసుకున్న పాత గాయాలు, బ్లాక్ కలర్ ట్రాగ్, చామనచాయ రంగు, 5 అడుగుల 7 అంగుళాలు ఉన్నట్లు గుర్తించారు. ఆచూకీ తెలిసిన వారు దువ్వాడ రైల్వే ఎస్ఐ శాంతారామ్కు తెలియజేయాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

దారాలమ్మ ఆలయంలో గాయత్రి హోమం

విశాలాంధ్ర – సీలేరు: కార్తీక మాసం పురస్కరించుకొని జీకేవీధి మండలం దారకొండ శ్రీశ్రీ దారాలమ్మ తల్లి దేవాలయంలో స్థానిక భక్తుల ఆధ్వర్యంలో గురువారం గాయత్రి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా దారకొండ గ్రామంలో ఉన్న దేవాలయాలకు బుధవారం పసుపు నీళ్లతో వారధి పోసారు. గాయత్రి హోమం, కుంకుమ పూజ నీరాజన మంత్రపుష్పం పూజను వేద పండితులు సోమయాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర – జీకేవీధి: జీకేవీధి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆసుపత్రిల సిబ్బంది, మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఏటీ డబ్ల్యూ స్కూలు 8, దారకొండ, గూడెం, పెదవలస, రింతాడ 1, 2, జెర్రెల, సప్పర్ల పాఠశాలలో ప్రతివారం సందర్శించి పిల్లలు ఆరోగ్య విషయాలు తెలుసుకోవాలన్నారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు కూడా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సూపర్వైజర్లు, ఆశ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నాసా కిట్లు అందజేత



విశాలాంధ్ర – యలమంచిలి: స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా) దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టుల రూపకల్పనలో సత్తా చాటినట్లు గురువారం పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు రమణ తెలిపారు. ఐఐటి మెడిసిన్, జిమ్మర్ వంటి పోటీ పరీక్షల్లో కాకుండా అంతరిక్ష పరిశోధనలోనూ తమదైన శైలిలో శ్రీ చైతన్య విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎజిఎం సురేష్ కోఆర్డినేటర్ రాజేష్, కోఆర్డినేటర్ వెంకటరమణ, పాఠశాల ప్రిన్సిపల్ రిషికేశ్ దాస్, డీన్ దత్తు, అసిస్టెంట్ డీన్ లోవేశ్వరావు, నాసా ఇన్చార్జ్ రామకృష్ణ, పాఠశాల ఇన్చార్జ్ ప్రకాష్ నాసా కిట్లను విద్యార్థులకు అందించి అభినందించారు.

రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

విశాలాంధ్ర – యలమంచిలి: అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రేంజ్ ఫారెస్ట్ అధికారి జి.అనీల్ కుమార్ అన్నారు. గురువారం యలమంచిలిలో గల అటవీ శాఖ కార్యాలయంలో రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో భూ కబ్జాదారులు, స్మగ్లర్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమరువీరులను స్మరించుకుని నివాళులర్పించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయం నుంచి ఆర్టీసి కాంప్లెక్స్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర – నర్సీపట్నం: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అనకాపల్లి జిల్లా ఆధ్వర్యంలో జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా నర్సీపట్నం మండల స్థాయి క్రీడా పోటీలు స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నర్సీపట్నం టౌన్ ఎస్సై గోవిందరావు, మండల విద్యాశాఖ అధికారి సాయిశైలజ ప్రారంభించారు. ఎస్సై గోవిందరావు మాట్లాడుతూ క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసం శారీరకదారుఢ్యం, క్రీడలు ఎంతో పేరు ప్రతిష్టలు తీసుకొస్తాయని అన్నారు. క్రీడా పోటీల్లో కబాడీ వాలీబాల్ క్రికెట్ సంబంధిత 200 మంది క్రీడాకారులు, పిడి కె.వరహాలబాబు, శాప్ కోచ్ కె.అబ్బు, నింజాస్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్ జగన్నాథ్, అడిగర్ల సతీష్ , బోలెం శివ, పిడిలు రవి, ప్రశాంత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారుల రక్తదానం

విశాలాంధ్ర – పాడేరు: ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ అల్లూరి సీతారామ రాజు జిల్లా శాఖ ప్రెసిడెంట్ సుమిత్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రోణంకి గోపాలకృష్ణ సూచన మేరకు ఏఎస్ఆర్ జిల్లా ఫారెస్ట్ డిపార్ట్మెంట్లో రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ కె.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని పీఓ ప్రారంభించారు. ముందుగా అసువులు బాసిన అమరవీరులకు ఐటీడీఏ పీఓ, డీఎఫ్ఓ, రెడ్క్రాస్ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ కె.శ్రీనివాస్, ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ సెక్రటరీ ఈశ్వరరావు, ట్రెజరర్ టి.అప్పారావు, లైఫ్ మెంబర్లు గౌరీశంకర్, మర్ల మణి, లోహితాస్, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కోతులను అరికట్టండి

విశాలాంధ్ర – నాతవరం: మనుషుల కంటే కోతుల సంఖ్య పెరిగేలా ఉందని నాతవరం మండలం చమ్మచింత గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి రామాలయం వద్ద గ్రామ పెద్దలు కోతులు సమస్య పరిష్కారం కొరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుషుల సంఖ్య కంటే కోతుల సంఖ్య పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్నాయని వాటిని తరిమేందుకు వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయన్నారు. ఇప్పటికే గ్రామంలో పలువురిపై దాడిచేసి గాయపరిచాయని చెప్పారు. నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేసినప్పటికీ తమ సమస్యపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అప్పన విజయ్, కాశపు నూకరాజు, బంటుపల్లి నానాజీ, శివలంక సత్తిబాబు, అప్పన సత్తిబాబు, నానాజీ గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదమ్ములను బలిగొన్న రోడ్డు ప్రమాదాలు
రెండు వారాల వ్యవధిలో ఇద్దరు దుర్మరణం

విశాలాంధ్ర – కశింకోట: మండల కేంద్రమైన కశింకోట జాతీయ రహదారిలో సరోజినీ గెస్ట్ హౌస్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొర్ర సత్తిబాబు (24) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. రోడ్డు దాటుతుండగా ఎలమంచిలి నుండి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొనడంతో తలకు తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతి చెందిన సత్తిబాబు అన్నయ్య బొర్ర నాగు(26) కూడా గత నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందాడు. రెండు వారాల్లోనే అందొచ్చిన కొడుకులిద్దరూ కళ్ల ముందే చనిపోవడంతో తల్లి దండ్రులు అప్పారావు, బొర్ర వరలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఎమ్మెల్యేగా గెలిస్తే మూడు నెలల్లో మెయిన్ రోడ్డు పనులు పూర్తి చేస్తా
– మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత వాగ్దానం

విశాలాంధ్ర – పాయకరావుపేట: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిస్తే మూడు నెలల్లో పాయకరావుపేట మెయిన్ రోడ్డు పనులు పూర్తి చేస్తానని టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. అనితమ్మ పల్లె పలకరింపు కార్యక్రమాన్ని పాండురంగ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రతిరోజు ఒక గ్రామం చొప్పున పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెద్దిరెడ్డి శ్రీను, యాళ్ళ వరహాల బాబు, లెక్కల గోవిందు, పల్లా విలియం కేరి, జూరెడ్డి ప్రసాద్, బొడపాటి శ్రీను, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గీతంతో అనుబంధానికి అమెరికన్ కంపెనీ ఆసక్తి

విశాలాంధ్ర – మధురవాడ: ప్రపంచవ్యాప్తంగా 25 దేశాలలో విస్తరించిన అమెరికాకు చెందిన ప్రముఖ ఇంజనీరింగ్ డిజైన్, ఐటి కంపెనీ ఎవీనియన్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అనుబంధానికి ఆసక్తి కనబరిచింది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధి బృందం గురువారం గీతం విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఎవీనియన్ ఇండియా అధ్యక్షుడు రఘ గణేశన్, మానవ వనరుల విభాగం ఉపాధ్యక్షుడు కె.ప్రసన్న, సీనియర్ ఉపాధ్యక్షుడు గిరి వెంకట రామన్, మానవ వనరుల విభాగం డైరక్టర్ అవీన్మళ్ళ గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సీనియర్ ప్రొఫెసర్లతో, ట్రైనింగ్ ప్లేస్మెంట్ విభాగం అధికారులతో సమావేశమయి వివిధ అంశాలపై చర్చించారు. గీతం స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ డాక్టర్ జి.వి.కె.శర్మ వివిధ కోర్సుల వివరాలు, పరిశోధనా ప్రాజెక్టులు, ప్రయోగశాలల ఆధునికీకరణ తదితర అంశాలను వివరించారు.

రహదారులను పక్కాగా నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలి

విశాలాంధ్ర – మధురవాడ: విశాఖలో రోడ్లను పక్కాగా నిర్మించి రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. విశాఖ జిల్లాలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న గోతుల రోడ్లను పక్కాగా వేసి ప్రమాదాలు నివారించి ప్రజలు ప్రాణాలకు రక్షణ కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని ఆటోలకు పెండింగ్లో ఉన్న పోలీస్ ఈ చలానాలను రద్దు చేసి డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావి కృష్ణ, కొల్లి సన్యాసిరావు, జి.శ్రీనివాస్, కే.శివ, కె.రాము, జి.ఈశ్వర్, బి.శేషు, ఎన్.నర్సింగరావు, కే.నర్సి ంగ్, నారాయణరావు, పి.నర్సింగరావు, ఎన్.లక్ష్మణ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపి బిల్డింగ్ అండ్ ఆదర్ కనస్ట్రక్షన్ వర్క్స్ యూనియన్ మహాసభలు

విశాలాంధ్ర – నర్సీపట్నం: ఈ నెల 10 నుంచి కృష్ణా జిల్లా గుడివాడలో ప్రారంభమైన ఏపి బిల్డింగ్ అండ్ ఆదర్ కనస్ట్రక్షన్ వర్క్స్ యూనియన్ (సిఐటియు)7వ మహాసభలకు అనకాపల్లి జిల్లా నుండి జిల్లా గౌరవ అధ్యక్షులు అడిగర్ల రాజు, జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు(చంటి), జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమరాజు, చందక రాముకృష్ణ, పి.చిరంజీవిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు అడిగర్ల రాజు మాట్లాడుతూ గత మహాసభ నుండి నేటి వరకు భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఏపి బిల్డింగ్, ఆదర్ కనస్ట్రక్షన్ వర్క్స్ యూనియన్ (సిఐటియు) చేసిన పోరాటాలు సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకొవడం జరుగుతుందన్నారు.

ప్రధాని సభ ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘన స్వాగతం పలకడంతో పాటు, ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 12వ తేదీన మూడు లక్షల మందితో ప్రధాని బహిరంగ సభ నిర్వహించనున్నామని పార్లమెంటరీ పార్టీ నాయకులు, ఎంపీ విజయసాయి రెడ్డి తెలియజేశారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్తో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాలో నుంచి ప్రధాని సభకు రెండు లక్షల మంది హాజరవుతారని, శ్రీకాకుళం, విజయనగరం, ఏఎస్ఆర్ జిల్లాల నుంచి సుమారు లక్ష మంది జనం హాజరు కానున్నారని చెప్పారు. సుమారు 30 ఎకరాల ప్రాంగణంలో ప్రధాని సభా కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 15వేల కోట్ల రూపాయల విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేస్తారని తెలియజేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ మల్లికార్జున, విశాఖ ఎంపీ ఎం వివి సత్యనారాయణ, విశాఖ ఉత్తరం నియోజకవర్గ ఇన్చార్జి కేకే రాజు, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సుధాకర్ పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైసీపీ సంకల్పం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర – డుంబ్రిగూడ: ప్రజా సంక్షేమమే వైసీపీ సంకల్పమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. స్థానిక ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మల ఆధ్వర్యంలో గసభ పంచాయతీ లోగిలి గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సంక్షేమ ఫలాలు అర్హులైన గిరిజనులకు అందుతున్నాయా లేదా అని ప్రతి గడపగడపకు వెళ్లి గిరిజనుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనుల దరిచేరే విధంగా సచివాలయం సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దొర బాబు, సిడిపిఓ నీలవేణి, ఎంఈఓ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

డిపార్టుమెంట్లో కార్మికుల సంఖ్య పెంచాలి

విశాలాంధ్ర – కూర్మన్నపాలెం: స్టీల్ప్లాంట్లోని కీలక విభాగాలలో కార్మికుల సంఖ్య పెంచాలని స్టీల్ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు జె.అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నేడు ప్లాంట్లోని సిఎంఎస్ గాథరింగ్ పాయింట్ వద్ద ఇనుస్ట్రుమెంటేషన్ మహాసభ నిర్వహించారు. దీనిలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విభాగం అధ్యక్షులుగా కె.శ్రీరామచంద్రరావు, కార్యదర్శిగా బి.నాగేశ్వరరావు, 12 మంది కార్యవర్గ సభ్యులు దీనిలో ఇద్దరు మహిళలు వై.ఝాన్సీ, పి హేమలకు ప్రాధాన్యతను కల్పించారు. అయోధ్య రామ్ మాట్లాడుతూ స్టీల్ప్లాంట్ ప్రైవేట్ వ్యతిరేక పోరాటం కొనసాగిస్తుందని ఆయన అన్నారు. ఇప్పటికే ఈ విభాగం ద్వారా సుమారు 50 సార్లు దీక్షా శిబిరంలో కూర్చుని తమ వ్యతిరేకతను ప్రదర్శించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్య క్రమంలో యూనియన్ కార్యవర్గం నుంచి యు.రామస్వామి, కె.గంగాధర్ వ్యవహ రించారు. దీనిలో విభాగం ప్రతినిధులుగా ఎ.సురేష్, గణేష్ కుమార్, సీతారామయ్య, కొండలరావు, సత్యనారాయణ, రామకృష్ణ, దివాకర్ నాయుడు పాల్గొన్నారు.

కార్తీక మహా దీపోత్సవంను విజయవంతం చేద్దాం
టీటీడీ జేఈవో సదా భార్గవి

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ఆర్కె బీచ్లో నవంబరు 14వ తేదీ టీటీడీ నిర్వహిస్తున్న కార్తీక మహా దీపోత్సవం కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు, దాతలు, శ్రీవారి సేవకులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేద్దామని టీటీడీ జెఈవో శ్రీమతి సదా భార్గవి పిలుపునిచ్చారు. కార్తీక మహాదీపోత్సవం నిర్వహించే స్థలాన్ని గురువారం ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. వేదిక నిర్మాణం, బారికేడ్లు, భక్తులు వచ్చీ పోయేందుకు ఏర్పాటు చేయాల్సిన మార్గాల గురించి అధికారులతో ఆమె చర్చించారు. 14వ తేదీ విశాఖలో మూడోసారి ఈ కార్యక్రమం నిర్వహణకు ముందుకు వచ్చిందన్నారు. గత ఏడాదికంటే మరింత ఘనంగా దీపోత్సవం నిర్వహణకు దాత లు ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పాల్గొనడానికి 2500 పాసులు జారీ చేస్తున్నామని ఒక పాసుమీద నలుగురిని అనుమతిస్తామన్నారు. శారదాపీఠం స్వామీజీ స్వరూపసరస్వతిని కూడా పిలిచి దీపోత్సవానికి హాజరు కావాలని కోరారు. టీటీడీ సివి ఎస్వో నరసింహ కిషోర్, ఎస్వి బిసి సిఈవో షణ్ముఖ్ కుమార్, ఎస్ఈ జగదీశ్వర రెడ్డి, దాతలు పైడా కృష్ణప్రసాద్, రాజేష్, సీతారాం, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర – గాజువాక : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు వెన్నా శ్రీరామమూర్తి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రూ.15వేల కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపనలు చేస్తారన్నారు. ప్రధానంగా రూ.10.742 కోట్లుతో 7 ప్రధాన ప్రజెక్టులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. రాయపూరు – విశాఖ గ్రీన్ ఫీల్డ్ రహదారి, విశాఖ రైల్వేస్టేషన్ ఆధునీకరణ, ఫిషింగ్ హార్బర్కు మెరుగులు వంటి తదితర కార్యక్రమాల్లో ప్రధానమంత్రి పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం శత శాతం పెట్టుబడులు ఉపసంహరణకు బదులు సెయిల్, ఎన్ఎండీసీతో కలిపి మెగా యూనిట్ గా చేసే విధంగా ప్రత్యామ్నాయ మార్గంను ప్రధాని మోదీ దృష్టికి రాష్ట్ర బీజేపీ నాయకత్వం తీసుకుని వెళుతుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

కంభవలసలో ఇంటింటికి టీడీపీ

విశాలాంధ్ర – అనంతగిరి: మండలంలోని కంభవలస గ్రామంలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మాజీ సభ్యులు, అరకు నియోజకవర్గ యువనేత సివేరి అబ్రహం పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి రాబోయే ఎన్నికల్లో వైసీపీకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తడిబరికి ఆనంద్, మాజీ ఎంపీటిసి సార దొన్ను,దివంగత నేత మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ తనయుడు సివేరి సురేష్, టీడీపీ మండల ఎస్ టి సెల్ అధ్యక్షుడు కళరాజు, టీడీపీ సీనియర్ నాయకులు కృష్ణా, దేముడు, తెలుగు యువత బాక నాగేశ్,సుందర్ రావు, ధయానిధి, రవీంద్ర, నవీన్, మోహన్ అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

గుమ్మిరేవులలో ప్రత్యేక వైద్య శిబిరం

విశాలాంధ్ర – సీలేరు: జీకేవీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గుమ్మిరేవుల గ్రామంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి హిమబిందు గర్భిణీలు, చిన్నారులతో పాటు మొత్తం 150 మంది రోగులకు వైద్య పరీక్ష నిర్వహించారు. అనంతరం వైద్యాధికారిణి గిరిజనులతో మమేకమై ఆరోగ్యవరంగా యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి సోకిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సేవలు పొందాలని కోరారు. జ్వర బాధితులు ఖచ్చితంగా రక్త పరీక్షలు నిర్వహించుకోని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఎటువంటి జ్వరాలు సోకిన నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తెలిపారు. రోగాల బారిన పడితే పసరు మందులకి నాటు వైద్యానికి నమ్మి ప్రాణాలు బలి చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యాధికారి రుక్మిణి, ఎంపిహెచ్ ఈవో పోతురాజు, హెచ్ఎస్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన గౌరవ అధ్యక్షుడిగా లింగన్న

విశాలాంధ్ర -దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో పంచా యతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. ఈ ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా లెక్కల లింగన్న, అధ్యక్షులు జే.అప్పారావు, ఉపాధ్యక్షులు జి.సంతోషినళిని, కార్యదర్శి పి.అప్పలనాయుడు, ట్రెజరర్ కే.సుధాకర్, సలహాదారుగా టి.పవన్ కుమార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఈ నూతన కార్యవర్గం ఇంచార్జ్ ఎంపిడిఓ జి.వి.రమణ నియామక పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 27 పంచాయితీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు

విశాలాంధ్ర – మల్కాపురం: పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని వారికి సముచిత స్థానం కల్పించడం ప్రధాన బాధ్యతని విశాఖ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. ఇటీవల సోషల్ మీడియా కో కన్వీనర్ గా నియమితులైన తంతటి సంపత్ కుమార్కు అభినందనలు తెలుపుతూ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్కు అంతరాయం

విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలో పోలాకి శ్రీనివాస రావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు శుక్రవారం బొడ్డపాలెం, తర్లువాడ పంచాయితీలకు ఉదయం 09. 00 గంటల నుండి మధ్యాహ్నం 2:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సురేష్కుమార్ తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన మహిళా పోలీసు

విశాలాంధ్ర – ముంచింగిపుట్టు: మండల పరిధిలో గల వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో గల అంగన్వాడి కేంద్రంలో అల్లూరి సీతా రామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా పోలీస్ ఏం సౌందర్య పరిశీలించారు. అంగన్వాడి కేంద్రం ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల బరువు ఎత్తుపై ఆరా తీశారు. చిన్నారులకు ఎదుగుదలకు పౌష్టికాహారం అంగన్వాడి కేంద్రం ద్వారా తప్పకుండా అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పౌష్టికాహారం లాభాలు ఉపయోగాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎం సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి వివాహానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించిన శరగడం

విశాలాంధ్ర – పెందుర్తి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, పార్టీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు చిన్నప్పల నాయుడు తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. గురువారం ఉదయం తాడేపల్లిలోని సీఎం నివాసంలో సతీ సమేతంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. కాగా గురువారం జన్మదిన వేడుకలు జరుకున్న అప్పలనాయుడు చిన్న కుమారుడు డాక్టర్ పవన్ భరత్ కు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

మూఢ నమ్మకాలు, గంజాయిపై అవగాహన

విశాలాంధ్ర – అరకులోయ: స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మీ కోసం మీ పోలీస్ కార్యక్రమం భాగంగా మూఢనమ్మకాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై గురువారం విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జి.దేముడు బాబు మాట్లాడుతూ గిరిజనులు అనారోగ్యాలకు గురైతే మూఢ నమ్మకాలు నమ్మి నాటు వైద్యం చేయించుకుని ప్రాణాలు వరకు తెచ్చుకోవద్దన్నారు. గంజాయి సాగు చేసి లేక గంజాయి వ్యాపారస్తులు ఇచ్చే డబ్బులకు ఆశపడి రవాణా చేయవద్దన్నారు. రవాణా చేసి దొరికితే బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. కళాశాల సిబ్బంది పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొర్రా పంచాయతీకి పర్యాటక శాఖ టోకరా

విశాలాంధ్ర – అనంతగిరి: బొర్రాలో పెండింగ్ బకాయి నిధులు, డిమాండ్లు పరిష్కరించకపోతే వచ్చే నెల 9వ తేదీన బొర్రా గుహలు బంద్ చేస్తామని సర్పంచ్ జన్ని అప్పారావు తెలిపారు. ఈ మేరకు బొర్రా గుహలు మేనేజర్ గౌరీశంకర్కు వినతిపత్రం అందించారు. దేశ విదేశాల నలుమూలల నుండి బొర్రా గుహలును తిలకించడానికి పర్యాటకులు వస్తుంటారని, సుమారుగా సంవత్సరానికి దాదాపుగా పర్యటకశాఖకు ఆదాయం కోట్ల రూపాయలు వస్తుందని, అలాంటి పర్యటకశాఖ గిరిజన పంచాయతీ అభివృద్ధికి 20 శాతం నిధులు ఇస్తామని చెప్పి మొండి చేయి చూపడం తగదన్నారు. 2007 సంవత్సరంలో హామీ ఇచ్చి నేటి వరకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీ అభివృద్ధి శూన్యంగా మారిందని అన్నారు. ఇప్పటికీ దాదాపుగా పంచాయతీకి 8 కోట్ల రూపాయలు నిధులు పర్యాటకశాఖ నుండి ఇవ్వాల్సి ఉందని దఫలవారీగా గైడ్లకు పర్మెంటు చేస్తామని ఒప్పంద ప్రకారం చెయ్యకపోవడం, ఎన్ని మార్లు సంబంధిత పర్యాటక శాఖఅధికారులకు వినతిపత్రాలు సమర్పించినా కుంటి సాకులు చెబుతున్నారని అన్నారు. బొర్రా గుహలు నుండి వచ్చే ఆదాయం 20 శాంతం రావల్సిన నిధులు 8 కోట్లు తక్షణమే చెల్లించాలని, బుర్ర గుహలను ఆధారపడి పని చేస్తున్న గైడ్లను పర్మినెంట్ చేయాలని,అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పీసకమిటీ అధ్యక్షులు రాంబాబు, వార్డు మెంబర్ ద్వారు, మాజీ కో ఆప్షన్ మెంబర్ రఫీ, బొర్రా గుహలు గైడ్ యూనియన్ నాయకులు రాము, రాజు, సోమేశ్, నగేష్, మల్లపురాజు,సింహాద్రి, సత్యారావు పాల్గొన్నారు.